# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశం అవుతారు.**
2. **వెనుకబడిన వర్గాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ గవర్నన్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేశామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
4. **గత 9 నెలలుగా అంతరిక్ష కేంద్రంలో ఉండిపోయిన సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లు ఈ తెల్లవారు ఝామున భూమిపైకి తిరిగి సురక్షితంగా చేరుకున్నారు.**
5. **తెలంగాణ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఈరోజు శాసనసభలో ప్రవేశపెట్టనుంది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. అలాగే గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ తో సమావేశమవుతారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఇది ఇలా ఉండగా అమరావతి రాజధాని నిర్మాణ పనుల ప్రారంభోత్సవంపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, సభనిర్వహణకు ఏప్రాంతం అనుకూలంగా ఉందో అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణకు సచివాలయం వెనుక 250 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

--------------------------

వెనుకబడిన వర్గాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాలలో భాగంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుపై నిన్న జరిగిన చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ ప్రజల నుంచి 8 వేల 681 ప్రతిపాదనలు స్వీకరించిందని, కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించామని రేవంత్ రెడ్డి పేర్కొంటూ,

వాయిస్ ..30 సెకన్లు

అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ గవర్నన్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేశామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శాసనసభ సమావేశాలలో భాగంగా నిన్న ఆయన మాట్లాడుతూ, మన మిత్ర ద్వారా ప్రజలకు మెరుగైన సేవలతో ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 200 సేవలను అందిస్తున్నామని ఈ నెలాఖరుకు మరో 300 సేవలను అందించేలా ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలుపుతూ

....వాయిస్ 35 సెకన్లు

---------------------------

దాదాపు 9 నెలలపాటు అంతరిక్షం కేంద్రంలో ఉండిపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు భూమిపైకి తిరిగి సురక్షితంగా చేరుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం -ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఈ తెల్లవారుజామున 3 గంటల 27 నిమిషాలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరానికి సమీపంలో ఉన్న సముద్ర జలాల్లో దిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

మరోవైపు... సునీతా విలియమ్స్ రాక కోసం భారత్ ఎదురుచూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమెకు లేఖ వ్రాసారు. ఆమె సాధించిన విజయాలపట్ల భారతీయులందరూ గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఈ రోజు శాసనసభలో ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్‌ను శాసన సభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రవేశపెట్టనున్నారు.

ఇదిలా ఉండగా ఈ ఉదయం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం కానుంది. ఈ సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతారు. కాగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం ఇది రెండవసారి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం మోడరన్ లాంగ్వేజ్-పేపర్1, జాగ్రఫీ పేపర్ -1 పరీక్షలు జరుగుతాయి.

కాగా.. తెలంగాణాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం కామర్స్ -పేపర్ 1, కెమిస్ట్రీ -పేపర్ 1 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్-వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా-వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. "క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

..ప్రోమో...

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం కొనసాగుతుందని, సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలుపుతూ,

వాయిస్ ..30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================